



గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ

- క్రీడాకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా క్రీడామాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని మంగళవారం జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో స్టేడియం ఎదుట కర్నూలు ఎంపి సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బివై.రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారి సంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వ లక్ష్యమని, నిరంతరం కలిసి కట్టుగా కృషి చేద్దామని అన్నారు. ధ్యాన్‌చంద్ విగ్రహానికి అతిథులు పూల మాలువేసి నివాళ్లు అర్పించారు. ఎన్నో సంవత్సరాలుగా ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని స్టేడియంలో ఏర్పాటు చేయాలన్న జిల్లా క్రీడాకారుల, హాకీ క్రీడాకారుల కల ఇప్పటికి సాకారం అయిందని సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాల్లో భాగంగా మేయర్ మాట్లాడుతూ క్రీడాకారుల అభివద్ధి కోసం కర్నూలు నగర పాలక సంస్థ నుంచి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై రాణించడం శుభపరిణామం అన్నారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీట వేస్తుందన్నారు. ఎంపి నిధుల నుంచి జిమ్ ఆధునీకరణ కోసం రూ.10 లక్షలు అప్రూవల్ లెటర్‌ను క్రీడాశాఖ సిఇఒ రమణకు అందజేశారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి క్రీడాకారుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు అనేక పోటీలను నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేసిన కృషి వెలకట్టలేనిదని అన్నారు. డిప్యూటీ మేయర్ రేణుక, 41 వ వార్డు కార్పొరేటర్ శ్వేతారెడ్డిలు మాట్లాడారు. అనంతరం జిల్లా నుంచి ఏషియన్ సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొన్న కళ్యాణి, జాతీయస్థాయి పోటీల్లో పథకాలు సాధించిన షర్మిల, అపర్ణ, పరమేష్, వీరేష్, గొల్లపల్లవిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు శ్రీనివాసరావు, కెవి.సుబ్బారెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కెజి గోవిందరెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘాల సిఇఒ పి.విజయ్ కుమార్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి గువ్వల శ్రీనివాసులు, పలువురు స్టేడియం కోచ్‌లు క్రీడా సంఘాల ప్రతినిధులు క్రీడాకారులు, ప్రయివేటు పాఠశాలల పిఇటిలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న నాయకులు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపిలు, ఎమ్మెల్యే, మేయర్ ,నాయకులు

విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలి
- 30 నుంచి వరకు సిపిఎం సమరభేరి
- సెప్టెంబర్ 4న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకుని వచ్చిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా బషీర్ బాగ్ తరహాలో ఉద్యమాన్ని చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ సంస్కరణల ఉపసంహరించుకోవాలని వారి డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. రెండు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బుధవారం నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సిపిఎం సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం సమరభేరి ప్రచార పత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014 ఎన్నికల ముందు ధరలు నిరుద్యోగంపై అనేక మాటలు చెప్పిన నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అయినా దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల విద్యుత్ చార్జీల భారం భరించలేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఆగస్టు 31నుండి సెప్టెంబర్ 4 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జరుగు సమరభేరి కార్యక్రమాన్ని దేశ వ్యాప్త నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆగస్టు 30, 31 తేదీలలో కరపత్రాల పంపిణీ చేస్తూ సంతకాల సేకరణ చేయాలని, ఒకటి రెండు తేదీలలో సచివాలయాల వద్ద ఆందోళనలు విద్యుత్ బిల్లుల దగ్ధం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 3 నిరుద్యోగంపై సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 4న జిల్లా కలెక్టరేట్ ఎదుట అన్ని మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు చేయాలన్నారు. విద్యుత్ సవరణ చట్టం 2020 తీసుకువచ్చి నేడు విద్యుత్తు రంగాన్ని ముక్కలు చేసి కార్పొరేట్ ప్రవేట్ కంపెనీలకు బిజెపి కట్టబెట్టిందన్నారు. ఫలితంగా భారీగా విద్యుత్ చార్జీలు ఇన్ని జరుగుతున్న విద్యుత్ సవరణ చట్టాన్ని ఏ రాష్ట్ర అమలు చేయకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం అమలు చేసి రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. మోడీ విధానాల వల్ల తీవ్రమైన భారాలు ప్రజలపై పడు తుంటే బిజెపి తీసుకొస్తున్న అ న్ని ప్రజావ్యతిరేక విధానాలకు అన్నింటికీ జగన్, చంద్రబాబు, పవన్ మద్దతుగా నిలుస్తున్నారని తెలి పారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు మాట్లాడుతూ తక్షణమే విద్యుత్‌చార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్లను పెట్టే ఆలోచన ఉపసంహరించుకోవాలన్నారు. రూ.400 గ్యాస్ సబ్సిడీతో ఇవ్వాలన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలన్నారు. ధరల నియంత్రణ కోసం నిధిని ఏర్పాటు చేయాలని దేశంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆస్తి పన్ను పెంపుదల ఉపసంహరించు కోవాలని చెత్త పన్ను రద్దు చేయాలన్నారు. సమావేశం లో సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, ఓల్డ్ సిటీ కార్యద ర్శి రాజశేఖర్, జిల్లా నాయకు లు నగేష్ పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ కోసం వినూత్న నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వినూత్న రీతిలో దున్నపోతుకు పిడిఎస్‌యు ఆధ్వర్యంలో వినతిపత్రం నిరసన మంగళవారం చేపట్టారు. పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్ర బాబు, పివైఎల్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగున్నర జగన్ ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులంతా పాడే కట్టడానికి సిద్ధంగా ఉన్నారని వారన్నారు. అదేవిధంగా ఏళ్ల తరబడి నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లో మగ్గిపోతు నలిగిపోయే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల హామీలను మరచి నిరుద్యోగుల ఆశలను నీరు కారుస్తున్న జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని వారన్నారు. వైసిపి ప్రభుత్వ తీరు చూస్తుంటే నిరుద్యోగ రాష్ట్రంగా తయారు చేయడానికి పునుకొనుకున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ కుమార్, నగర నాయకులు గోవర్ధన్, గోపాల్, వర్మ, పివైఎల్ నాయకులు బాషా, రాము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

- టిడ్కో గృహాలకు రుణాలు మంజూరు చేయండి
- కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ బ్యాంక్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ లోని మినీమీటింగ్ హాల్లో మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ అధ్యక్షతన జిల్లాబ్యాంక్ అధికారులతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్టిక్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని అందుకు సంబంధించిన అర్హత పొందిన లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు ప్రవేశపెట్టిన జగనన్న తోడు, జగనన్న బడుగు వికాసం, పిఎంఇజిపి పిఎంఎంఎవై, స్టాండప్ ఇండియా, పథకాల సంబంధించి అర్హత ఉన్నవారికి యువ పారిశ్రామికవేత్తలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేలా అవకాశం కల్పించాలని తెలిపారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు వెంటనే మార్ట్ గేజ్ డాక్యుమెంట్ సదుపాయం ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కమిషనర్ కోరారు. కెనరా బ్యాంక్ వారి సహకారంతో సెల్ ఫోన్ రిపేర్లు సర్వీసు, ఫోటోగ్రఫీ ,వీడియోగ్రఫీ ,ద్విచక్ర వాహనాల రిపేరు, మోటార్ వైన్డింగ్ ,సిసిటివి సర్వీసింగ్ తదితర శిక్షణ కార్యక్రమాలు పొందిన యువత వారు ఇచ్చు సర్టిఫికెట్లను బ్యాంకుకు సమర్పించి వారి చేత రుణాలు పొంది స్వయం సమృద్ధి సాధించాలని కోరారు. అటల్ పెన్షన్ యోజన పథకానికి 53,913 మంది లబ్ధిదారులని చేర్పించడం ద్వారా కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని సాధించిందని కమిషనర్ భార్గవ తేజ తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి సంబంధించి రూ.4,550.92 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇందులో వ్యవసాయ రంగానికి 2739.58 కోట్లు మంజూరు చేసినట్లు, ఇది మొత్తం ఆర్థిక సంవత్సరానికి 40.33 శాతం గా ఉంది అని తెలిపారు. ఇందులో పంట రుణాలకు సంబంధించి 2050.24 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌కు నిర్దేశించిన రూ.2082.59 కోట్ల లక్ష్యానికి గానున రూ.806.96 కోట్లు మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగానికి సంబంధించి రూ.3641.72 కోట్లు మంజూరు చేసినట్లు ఇది నిర్దేశించిన లక్ష్యానికి 36.20శాతంగా ఉందని తెలివపారు. రాబోయే మూడు త్రైమాసికాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని జిల్లా బ్యాంకు అధికారులకు లీడ్ బ్యాంకు మేనేజర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న తోడు పథకాన్ని జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ తెలిపారు. పెండింగ్లో ఉన్న పీఎం స్వా నిధి, టిడ్కో రుణాలు త్వరగా పూర్తి చేయాలని బ్యాంకర్లను కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ కౌలురైతులకు సిసిఆర్‌పి కార్డులను మంజూరు చేశామని, జిల్లాలో ఉన్న బ్యాంకు అధికారులు సిసిఆర్‌సి కార్డులు ఉన్న రైతులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిజిఎం సుబ్బారెడ్డి, కెడిసిసిబి సిఇఒ రామాంజనేయులు, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎపి రావు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ ఆఫీసర్ నాగప్రవీణ్, వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు , అన్ని బ్యాంకుల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్ తేజ



ఇసుక రీచ్ వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

ఇసుక దందాపై దండెత్తిన టిడిపి దండు

ప్రజాశక్తి- సి బెళగల్

సిబెళగల్ మండలం తుంగభద్రనది తీరంలో వైసిపి ఇసుక అక్రమ దందాపై టిడిపి దండు మంగళవారం దండెత్తారు.. రాష్ట్ర టిడిపి కమిటీ సభ్యులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, జాతీయ కమిటీ నాయకులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ, జిల్లా మహిళా అధ్యక్షులు ముంతాజ్ బేగం, మహిళా నాయకురాలు కృష్ణవేణి, అధికార ప్రతినిధి సిబి లత, కోడుమూరు ఇంచార్జి ప్రభాకర్, మండల కన్వీనర్ గోవింద్ గౌడ్, గూడూరు మాజీ జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సి బెళగల్ మాజీ కన్వీనర్ పాండుగౌడ్, గూడూరు నాయకులు సుందరరాజు, గజేంద్ర, ముస్లిం మైనారిటీ బెళగల్ అధ్యక్షులు దూద్వలి, పెద్ద ప్రభు, చిన్న ప్రభు తదితరులు టీడీపీ ఇసుక సత్యాగ్రహంలో పాల్గొని ఈర్లదిన్నే, సింగవరం, ముడుమాల, పలదొడ్డి ఇసుక రీచ్‌లలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మే 15కు గడువు తీరినా అడ్డదారిలో కోట్లు గడించేందుకు వైసిపి ఇసుక దందా ఆపడం లేదన్నారు. ఫలితంగా రోడ్లు ధ్వంసం ఆపై బస్సుల నిలిపివేతతో విద్యార్థులు విద్యకు దూరం, కనీస అవసరాలు, ప్రయాణాలు దుర్భరంగా మారాయని వాపోయారు. అనంతరం పోలీస్ స్టేషస్టేషన్‌లో ఎస్‌ఐ పీరయ్యకు ఇసుక దందాలు ఆపాలని ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న గిడుగు పాత్రదారి ఇనయతుల్లా, వేదికపై పత్తిఓబులయ్య, తదితరులు

వైవిధ్యంగా సాగిన గిడుగు జయంతి

ఆకట్టుకున్న కవన విజయం రూపకం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

తెలుగు భాషాదినోత్సవ సందర్భంగా టిజివి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి కవన విజయం సాహిత్య రూపక ప్రక్రియ జరిగింది. ఒకనాడు ఆంధ్రదేశంలో తమ తెలుగు కవితలతో చైతన్యం కలిగించిన కవులు స్వర్గంలో గిడుగు రామ్మూర్తి పంతులు అధ్యక్షతన సమావేశమై తెలుగు కవుల గొప్పతనాన్ని వివరిస్తూ కవిత్వం చెప్పే ప్రక్రియ ఇది. ఇందులో సంధానకర్త గిడుగు పాత్రధారి ఇనాయతుల్లా వ్యవహరించగా మిగిలిన కవులలో డాక్టర్ సి.నారాయణరెడ్డిగా ఎస్ మహమ్మద్ మియా, కాళ్ళకూరి నారాయణరావుగా పత్తి ఓబులయ్య, దివాకర్ల తిరుపతి శాస్త్రి పాత్రలో కె. బాల వెంకటేశ్వర్లు, జంట కవులలో ఒకరైన వెంకటకవిగా శ్రీనివాస్ రెడ్డి శ్రీశ్రీ పాత్రలో డాక్టర్ మధుసూదనాచారి, మొల్ల కవయిత్రి పాత్రలో డాక్టర్ చంద్రమౌళిని వారి పద్యాలతో అలరించారు. ఆధునిక ప్రాచీన కవుల సమ్మిళితంగా సాగిన ఈ కవన విజయరూపకం వైవిధ్యంగా సాగింది. కవులపాత్రలో నటులు జీవించారు. వివిధ సన్నివేశాల్లోని పద్యాలు పాటలు వినిపించి తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. సభప్రారంభానికి ముందు సాహితీస్రవంతి రాష్ట్రఅధ్యక్షులు కెంగార మోహన్ , ప్రముఖవిమర్శకులు నాగేశ్వరాచారి గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.సభ అనంతరం కవులను ఘనంగా సత్కరించారు.

మాతృభాషను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మాతృభాష ఆ భాష మాట్లాడేవారి జీవనాడి అని భాషను మరిస్తే ఆ చరిత్ర సంస్కృతులు, వృత్తి నైపుణ్యాలు అవగాహన సామర్థ్యం మరుగున పడిపోతాయని దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ ఆదవాని హనుమంతప్ప తెలిపారు. కర్నూలు కెవిఆర్ కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవం సదస్సుకు ఆయన హాజరయ్యారు. శాంతి సాహితీ సంస్థ, తె లుగు అధ్యయన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో పలువురు భాషావేత్తలు ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి తెలుగు వాడుక భాష కోసం శ్రమించిన ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు. బిల్లోన కృష్ణమూర్తి, చిన్నావుల రాజారెడ్డి,తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ప్రమీల, షేక్షావలి, డాక్టర్ దేవికరాణి, డాక్టర్ దండ బోయిన పార్వతి దేవి, డాక్టర్ లత, డాక్టర్ సునీత రాచపూడి జయ సుశీల, నాగమ్మ మణికంఠ పద్మ మాట్లాడారు. తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన మానస కు తెలుగు అధ్యాపకురాలు లత పారితోషకాన్ని అందించారు. విద్యార్థుల ఉపన్యాసాలు, పాటలతో సభ ఉత్సాహభరితంగా సాగింది

జిజిహెచ్ నిర్వహణకు రూ.3 కోట్లు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు - కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సివిల్, నిర్వహణ పనులకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని, ఈ మొత్తాన్ని రోగులకు సౌకర్యవంతంగా ఉండే పనులకు మాత్రమే ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎపిఎంఎస్ఐడి సి ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం ఆస్పత్రి ధన్వంతరి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన హాస్పిటల్‌డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ జి. సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంఏ.హాఫీజ్ ఖాన్, డాక్టర్ సుధాకర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ హాజరయ్యారు. సూపరిండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన యాక్షన్ టేకెన్ రిపోర్టును చదివి వినిపించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 కోట్లను ఇంజనీర్ల కోణంలో కాకుండా, రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఖర్చు చేయాలని సూచించారు..ఆస్పత్రి లోని ఆయా విభాగాల హెచ్ఒడిలతో మాట్లాడి అత్యవసరమైన పనులను చేయాలని సూచించారు. ముఖ్యంగా రోగులకు అవసరమైన టాయిలెట్ మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్స్, ఫ్లోరింగ్, ప్లంబింగ్, లిఫ్టులు,సీసీ కెమెరాలు, ఎసిల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇంజనీర్లను ఆదేశించారు. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కింద వచ్చే నిధులను ప్రైవేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు కూడా నిర్వహించే పరిస్థితిని తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల శాతాన్ని మరింత మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రులలో ప్రసవాల శాతంపై ప్రతి వారం చీఫ్ సెక్రటరీ సమీక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు కింద ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చడంతో పాటు వైద్యుల కొరత లేకుండా రిక్రూట్మెంట్ చేస్తూ, ఎన్నో రూ.కోట్ల ఖర్చు చేస్తోందన్నారు. ఆస్పత్రిలో ఉన్న చెత్తను సరైన సమయానికి తీసుకెళ్లే విధంగా సంబంధించిన కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న 4 క్యాంటీన్ల వారి చెత్తను కూడా ఇందులో కలుపుతున్నారని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, అలా చేస్తున్న క్యాంటీన్ల యజమానులకు ఫైన్ వెయ్యాలని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో ఎవరంటే వారు వచ్చి వాహనాలు పార్క్ చేసి వెళు_న్నారని, దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ అంశంపై కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ పార్కింగ్ ఫీజులు వసూలు చేయకుండా వాహనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు..ఇప్పటికే టాబ్లెట్స్, పరీక్షలకు బయటకు రాసివ్వడం వల్ల రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. శానిటేషన్, డైట్, సెక్యూరిటీ, వాషింగ్, మెడికల్ షాప్స్ తదితర ఏజెన్సీల పనితీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆస్పత్రి లో అన్ని వ్యవస్థలు సక్రమంగా పని చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని కలెక్టర్ తో అన్నారు. కలెక్టర్ స్పందిస్తూ మొదట ఆస్పత్రికి రోజుకు ఎన్ని వెహికల్స్ వస్తున్నాయో అంచనా వేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా రోగులను మందులకు, ఇతర పరీక్షల కోసం బయటకు పంపకుండా గట్టి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగా రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ బి రామ గిడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన , వైదికపై ఎంపి , ఎమ్మెల్యేలు

చదవాలనే కసి ఉంటే మంచి ఫార్మసిస్టు అవుతారు

దానికి అనువైన కళాశాల మైపర్ - ప్రజాశక్తితో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

ఒక మంచి ఫార్మసిస్టు కావాలంటే విద్యార్థికి చదవా లనే కసిఉండాలి. మంచి లెక్చరర్స్ ఉండాలి. మంచి కాలేజీ ఉండాలి. కాలేజీకి అనుబంధంగా హాస్పిటల్స్ ఉండాలి. కర్నూలులో ఇవన్నీ అందిస్తున్న ఏకైక కళాశాల మైపర్ కళాశాల అని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. ఫార్మ్‌డి కోర్సు ఎప్పుడు ప్రారంభమైంది. ఎన్నేళ్లు చదవాలి. ఎలాంటి సిలబస్ ఉంటుంది. ఎలాంటి ఉద్యోగ అవశాలుంటాయి. అనే అంశాలు ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు... ఆయన మాటల్లో.......




పరీక్షలు చేస్తున్న విద్యార్థులు

1948 నియంత్రణ చట్టం 8,10 లోబడి ఫార్మసీ ఇండియా ఫార్మ్ డి కోర్స్ ని 2008లో ప్రారంభించింది. ప్రస్తుతం ఫార్మ్ డి లో 2015 ప్రాక్టీస్ రెగ్యులేషన్స్‌కు సంబంధించిన సరికొత్త విషయాల, ప్రధాన విషయాలు గురించి ఇప్పుడు తెలియజేస్తాను. ఫార్మ్ డి కోర్స్ చదవాలంటే ఇంటర్మీడియట్ లేదా సిబిఎస్ఇలో ఎంపిసి లేదా బిపిసి చదివిన వారు అర్హులు.

ఫార్మ్ డి కోర్స్ నిర్మాణం గురించి : ఫార్మ్ డి అంటే డాక్టర్ ఆఫ్ ఫార్మసీ అంటే మందులకు లేదా థెరపీకి సంబంధించిన వైద్యులు. వైద్యం చేయాలంటే వివిధ రకాలైన నిపుణులు అవసరం అందులో ముఖ్యంగా డాక్టర్, ఫార్మసిస్ట్ ,నర్స్, టెక్నీషియన్ అనుబంధ ప్రొఫెషనల్స్ అందరూ కలిస్తేనే వైద్యం చేయగలరు. పాత వైద్య విధానాలు ఇప్పటి వైద్య విధానాలకు చాలా వ్యత్యాసం ఉంది. ఫార్మ్ డి కోర్స్ చదివే విద్యార్థిని విద్యార్థులు ఎంబిబిఎస్‌కు సమానమైన సిలబస్‌ను చదువుతారు. ఉదాహరణకు సైకాలజీ బయో కెమిస్ట్రీ ,మైక్రోబయాలజీ, పేతాలజీ, ఫార్మకాలజీ , మెడిసిన్ సర్జరీ, పీడియాట్రిక్స్ ఆర్థోపెడిక్ ఇఎన్‌టి అండ్ ఆప్తమాలజీ సబ్జెక్టును ఎంబిబిఎస్‌లో లాగానే ఫార్మ్ డి విద్యార్థులు కూడా చదువుతారు. జబ్బుల పట్ల డాక్టర్‌కు ఎంత అవగాహన ఉంటుందో ఫార్మసిస్టులకు కూడా అంతే అవగాహన ఉంటుంది. ఎంబిబిఎస్‌లో సర్జికల్ , ప్రిస్క్రిప్షన్ కోర్స్ చేస్తారు. ఫార్మ్ డి కోర్స్ లో మందులు ఎలా పని చేస్తాయి. ఎప్పుడూ ఆపాలి అనే విషయాలు నేర్చుకుంటారు. అదనంగా ఫార్మ్ డి వారు ఫార్మషూటికల్స్, ఫార్మషూటికల్ కెమిస్ట్రీ చదువుతారు. ఇందులో మందుల పట్ల అవగాహన, జబ్బుల గురించి అవగాహన , కొత్త మందుల కనుక్కో వడంలో కూడా అవగాహన వుంటుంది . ఫార్మ్ డి కోర్స్ ఆరు సంవత్సరాలు ఉంటుంది. ఐదు సంవత్సరాలు థియరీ, ఆరో సంవత్సరం క్లినికల్ అప్రెంటిషిప్ చేస్తారు.

ఉద్యోగ అవకాశాలు: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదించిన ఆరేళ్ల ప్రొఫెషనల్ కోర్సు అయిన ఫార్మ్ డి. చదివినవారు రిటెయిల్ ఫార్మసిస్ట్, క్లినికల్ ఫార్మసిస్ట్, కమ్యూనిటీ ఫార్మసిస్ట్, డ్రగ్ అడ్వైజర్, అనలిటికల్ కెమిస్ట్, మెడికల్ రైటర్, క్లినికల్ ట్రయల్స్ సైంటిస్ట్, ఫార్మకో విజిలెన్స్ సైంటిస్ట్, లెక్చరర్ లాంటి ఉద్యోగాలకు అర్హులవుతారు. వీరు ఫార్మాస్యూటికల్ రంగంలో ప్రొడక్షన్, టెస్టింగ్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అస్యూరెన్స్, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంటులో కీలకపాత్ర పోషిస్తారు. ఇవేకాకుండా, ఫార్మకో ఎకనమిక్స్, ఫార్మకో ఎపిడమాలజీ, క్రోనో ఫార్మకాలజీ, ఫార్మకో జెనోమిక్స్, ఫార్మకో జెనెటిక్స్ లాంటి విభాగాల్లోనూ ప్రత్యేకమైన ఉద్యోగావకాశాలుంటాయి. విదేశాల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉన్నాయి. మనదేశంలో ఫార్మ్.డి కోర్సు పూర్తి చేసినవారికి ఇటీవల కొంత డిమాండ్ పెరుగుతోంది. ప్రభుత్వ రంగం కంటే ప్రైవేటు రంగంలోనే వీరికి ఎక్కువ ఉద్యోగాలున్నాయి. ఫార్మ్ డి తరువాత ఫార్మా కంపెనీల్లో, ప్రైవేటు ఆసుపత్రులు, క్లినికల్ ట్రయల్స్ నిర్వహించే సంస్థలూ, రెగ్యులేటరీ సంస్థలూ, మెడికల్ కోడింగ్, మెడికల్ ఇన్సూరెన్స్ సంస్థల్లో, ఫార్మసీ కళాశాలల్లో ఉపాధి కోసం ప్రయత్నించవచ్చు.



రజకుల సమస్యల పరిష్కారానికి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ



రజకుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం నిర్వహిస్తామని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్ తెలిపారు. మంగళవారం దేవనకొండలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. కబీర్ అధ్యక్షత వహించారు. గురుశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రజకులకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఛైర్మన్, డైరెక్టర్లు, బోర్డు నియమించినా కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రజకుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందని తెలిపారు. చెరువులపైన రజకులకే పూర్తి హక్కు ఉండాలని, దేవాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్లు ఇవ్వాలని, రజకుల భద్రత కోసం సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పట్టణ, మండల కేంద్రాల్లో మోడరన్ ధోబీ ఘాట్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్హులైన రజకులకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి ఇస్త్రీదారునికి 250 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. అలాగే అపార్ట్‌మెంట్ వాచ్‌మేన్ కమ్ ఇస్త్రీదారులకు కనీస వేతన చట్టం అమలు జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో జిల్లాలోని మండలాల్లో రజకుల సమస్యలపై అధ్యయన బృందాలుగా ఏర్పడి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా కమిటీ సభ్యులు కోటకొండ సూరి, మండల నాయకులు వీరేష్, నరసింహులు, సుంక్కన్న, గోపి పాల్గొన్నారు.

పంట రక్షణకు జాగ్రత్తలు అవసరం

- పంటలను పరిశీలించిన బనవాసి శాస్త్రవేత్త రమేష్

ప్రజాశక్తి -పెద్దకడబూరు

పంటల రక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం ఎఇ ఎం.వర ప్రసాద్‌తో కలిసి నౌలెకల్, బసలదొడ్డి, గ్రామాల్లో పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలను పరిశీలించారు. చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మిరపలో పైముడత, ఎండు తెగులు, వేరుపురుగు, జెమిని వైరస్‌ను గమనించినట్లు తెలిపారు. పత్తిలో పూత, పిందె రాలడం, గులాబీరంగు పురుగు ఉనికిని గమనించినట్లు చెప్పారు. తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

తూతూమంత్రంగా మండల మీట్

- పరిష్కారం కాని రోడ్ల సమస్యలు

ప్రజాశక్తి - హోళగుంద



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ఎంపిపి నూర్జాన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమస్యలు మాత్రం పరిష్కారం కాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మండలంలో రోడ్ల సమస్యలు వెంటాడుతున్నా ఆర్‌అండ్‌బి అధికారులు ప్రతి సమావేశంలో 'ఇదిగో.. అదిగో' అంటూ కాలయాపన చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారులు రోడ్లు వేయడానికి ముందుకు రావడం లేదు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు వెనకడుగు వేయడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని, వారి టెండర్‌ను రద్దు చేసి వేరే గుత్తేదారులకు రోడ్ల పనులు అప్పజెప్పడానికి ఉన్నతాధికారులు చర్చిస్తున్నారని ఆర్ అండ్ బి ఎఇ రవికాంత్ తెలిపారు. ప్రస్తుతం వర్షాల్లేక విద్యుత్ కోత విధిస్తున్నారని, తాగునీటి సమస్య ఏర్పడిందని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామని విద్యుత్ ఎఇ ఓబులమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మనోహర్ తెలిపారు. సమావేశంలో చర్చించిన సమస్యలను మరో మూడు నెలల్లో జరిగే సర్వసభ్య సమావేశంలోపు పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు అధికారులను కోరారు. ఎంపిడిఒ రాధా, అగ్రికల్చర్ ఆఫీసర్ ఆనంద్, హౌసింగ్ ఎఇ వర్మ, ప్రాథమిక వైద్య అధికారిని బిందు మాధవి పాల్గొన్నారు.

హత్తిబెళగల్ పీడీకి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని హత్తిబెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పిడి.చినబాబుకు మంగళవారం స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. డిఇఒ రంగారెడ్డి చేతుల మీదుగా కర్నూలులో ఈ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

ధ్వజారోహణతో ఆరాధనోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీమఠం ముఖద్వారంపై కాషాయ జెండాను పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రారంభించారు. అనంతరం గోపూజ, అశ్వపూజ, లక్ష్మీ ధాన్య వంటి పూజలు నిర్వహించి, బాజాభజంత్రీలతో మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మాట్లాడారు. విశ్వగురువుగా పేరుగాంచిన రాఘవేంద్రస్వామి 352వ ఆరాధన సప్త రాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం, వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో నదీ తీరంలో షవర్లు ఏర్పాటు చేశామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, శ్రీమఠం ఆరోగ్యశాల నుంచి ప్రాథమిక చికిత్స కేంద్రాలను, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆరాధనోత్సవాలకు ప్రముఖులు, దాతలు అధిక సంఖ్యలో వస్తుంటారని, సామాన్య భక్తులకు సామూహిక వసతి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఉంచామని, భక్తులు సుచి, శుభ్రతను పాటించాలని సూచించారు. రెవెన్యూ, ఆర్అండ్‌బి, విద్యుత్, గ్రామ పంచాయతీ శాఖల అధికారుల సహకారంతో పోలీసు శాఖ భద్రతల మధ్య దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిపాలన కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పూజలు నిర్వహించి సిబ్బందిని ఆశీర్వదించారు. రాష్ట్రపతి ప్రతిభ అవార్డు గ్రహీత, డాక్టరేట్, పండిత కేసరి మహామహోపాధ్యాయ బిరుదాంకితులు రాజా ఎస్ గిరియాచార్యులు, పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్ అప్రమేయాచార్, ఎఎం మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోష్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ రావు పాల్గొన్నారు.



సప్త రాత్రోత్సవాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

వీధి కుక్కల స్వైర విహారం

- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 16వ వార్డులో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి బోయ పార సంగీతను మంగళవారం పట్టణ టిడిపి నాయకులతో కలిసి పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో కుక్కలను కూడా నివారించలేని చేతకాని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అని మండిపడ్డారు. మూగజీవాలను తానూ చంపమని చెప్పడం లేదని, వాటిని పట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణంలో ఎక్కడ చూసినా రోడ్లకు అడ్డంగా పశువులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్నారులు, పాదచారులపై దాడులు చేస్తున్నాయని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాలన మరిచి వైసిపి తొత్తుగా వ్యవహరిస్తూ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కమిషనర్ గంగిరెడ్డికి వైసిపి అంటే మక్కువ ఉంటే కండువా కప్పుకొని కౌన్సిలర్‌గా వైసిపి తరపున పోటీ చేయాలని హితవు పలికారు. గ్రేడ్-1 మున్సిపాలిటీని అవినీతి మున్సిపాలిటీగా మార్చి పట్టణంలో కనీసం కుక్కలను కూడా నియంత్రించలేని స్థితికి మున్సిపాలిటీని దిగజార్చిన ఘనత వైసిపి నాయకులు, మున్సిపల్ అధికారులకు దక్కిందని విమర్శించారు. కమిషనర్ ఛాంబర్‌ను రియల్ ఎస్టేట్ దందాలు, వ్యాపారాలకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఎక్కడ ఉన్నా ఆయన అవినీతి చిట్టా మొత్తం బయటకు తీసి తగిన చర్యలు తీసుకునే వరకు నిద్రపోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కమిషనర్ గంగిరెడ్డి లాంటి వారిని సస్పెండ్ చేయాలని తెలిపారు.



బాలికను పరామర్శిస్తున్న బీవీ

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

ప్రజాశక్తి - నందవరం

ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు మంగళవారం ఉదయం నాగలదిన్నె గ్రామ సమీపంలో తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మాదిగ ఆరేకంటి చిట్టి బాబు, బోయ శ్రీనివాసులు, తెలుగు రామకృష్ణ, కురువ తిరుమలేష్, తెలుగు ఉసేని, బోయ వీరేశ్, కురువ లింగప్ప, కురువ రవి అనే ట్రాక్టర్ల డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసి, 5 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మొదటి నలుగురు మిట్టాసోమాపురం గ్రామానికి చెందిన వారుగా, మరో నలుగురు ఐజ మండలం రాజాపురం గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుకను తరలించాలని, అక్రమంగా తరలించాలని చూస్తే కేసు నమోదు చేసి, జైలుకు పంపుతామని ఎస్‌ఐ పి.తిమ్మయ్య హెచ్చరించారు.

టిడిపి బలోపేతానికి కృషి : టిడిపి

ఆదోని : వచ్చే 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రావుఫ్ కోరారు. మంగళవారం ఆదోని మండలం గణేకల్, కడితోట మాజీ సర్పంచులు మూకయ్య, రాజశేఖర్ గౌడ్, ఇస్వీ అయ్యప్ప, పార్వతమ్మ, నాయకులు, కార్యకర్తలను కలిసి సుదీర్ఘంగా చర్చించారు. టిడిపి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. నాయకులు ఫక్రుద్దీన్, రామచంద్రప్ప, సోమశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, మద్దికెర రామకృష్ణ, ఎమ్‌డి.హుస్సేన్, నారాయణపురం గోవిందు, తిక్కన్న, తిమ్మప్ప, బసవరాజ్, పరమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఆదోనిరూరల్ : మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో చింతలముని స్వాముల వారి 45వ ఆరాధన మహోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను జెఎంఆర్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని యూత్ సభ్యులు తెలిపారు. ప్రతేడాది కబడ్డీ పోటీలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని చెప్పారు. వైసిపి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయానికి ఆర్థిక సాయం

దేవనకొండ : మండలంలోని కుంకునూరు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయనికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు వైసిపి వెలమకూర్ నాయకులు రామచంద్ర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఆర్థిక సహాయాన్ని ఆ గ్రామానికి చెందిన పెద్దలకు అందజేశామని వివరించారు. రామలింగేశ్వర స్వామి ఆలయ కలశ స్థాపన పూజల నిర్వహణ కోసం ఈ ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు, మాజీ సర్పంచి ఆంజనేయ, రామప్ప రెడ్డి, గిత్త శంకరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇసుక మాఫియా

- రూ.వేల కోట్లు దోచుకున్న వైసిపి
- వచ్చే ఎన్నికల్లో టిడిపిదే అధికారం
- మంత్రాలయం ఇన్‌ఛార్జి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఇసుకను అక్రమ తరలించి వైసిపి నాయకులు రూ.వేల కోట్లు దోచుకుంటున్నారని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం కౌతాళం మండలం గుడికంబాలి గ్రామంలో ఇసుక రీచ్ వద్ద నిరసన చేపట్టారు. ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినదించారు. తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి, పత్తికొండ ఇన్‌ఛార్జీ కెఇ.శ్యాంబాబు, పరిశీలకులు శివబాల, సబితమ్మ పాల్గొని మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు కొత్త ఇసుక పాలసీ అంటూ ప్రజలను మభ్యపెట్టారని, అధికారంలోకి రాగానే ఇసుక దొరకకుండా చేశారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేయడం వల్ల కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో ఎక్కడికక్కడ ఇసుక రీచ్‌లను నెలకొల్పి స్థానిక ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు ఇసుకను అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిస్తూ భారీగా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజాధనం దోపిడీకి గురి కావడమే కాకుండా ప్రజలకు ఇసుక దొరకకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించి ఇసుక అక్రమ రవాణాపై విచారణ చేపట్టాలని కోరారు. వచ్చే 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాగానే పాత విధానాన్ని అమలులోకి తీసుకొచ్చి అందరికీ ఇసుక దొరికే విధానాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కౌతాళం ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, తెలుగు యువత కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోట్రేష్ గౌడ్, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, బీసీ సీనియర్ నాయకులు వక్రాణి వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, చావిడి వెంకటేశ్వర్లు, రమేష్ గౌడ్, బీసీ సాధికార రాష్ట్ర సభ్యులు కురువ మల్లికార్జున, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, కౌతాళం నాయకులు టిప్పు సుల్తాన్, కురుగోడు, రహిమాన్, రాజానందు, రాజబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలో 16వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో సిసి రోడ్డు, 23వ వార్డులో రూ.9.5 లక్షలతో డ్రెయినేజీ, 24వ వార్డులో రూ.10.5 లక్షలతో సిసి రోడ్డు పనులకు వార్డు కౌన్సిలర్లతో కలిసి భూమిపూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

- సహాయ కమిషనర్ వాణి

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాల్లో భక్తులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని సహాయ కమిషనర్ వాణి హెచ్చరించారు. మంగళవారం కల్యాణ కట్టలో కేశఖండన కార్మికులతో సమావేశం నిర్వహించారు. భక్తులకు గుండు గీయడానికి రూ.వంద వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈరన్న స్వామి భక్తులకు సేవలు అందించాలని, వారి నుంచి డబ్బులు వసూలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులకు మంచి సేవలు అందించి, పుణ్యక్షేత్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అధిక ధరలతో భక్తులను నిలువు దోపిడీకి గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూపరింటెండెంట్లు రామ్మోహన్, వెంకటేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా హరికృష్ణ వర్ధంతి

ప్రజాశక్తి - ఆస్పరి

టిడిపి చైతన్య రథసారథి, సినీరంగంలో నటుడుగా, రాజకీయ నాయకునిగా తెలుగు ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న నందమూరి హరికృష్ణ వర్ధంతిని ఆస్పరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి యూత్ మండల కన్వీనర్ రాఘవేంద్ర, సతీష్ కుమార్ మాట్లాడారు. నందమూరి హరికృష్ణ ఆపన్నులకు అండగా నిలిచే వ్యక్తి అని తెలిపారు. ఆత్మీయత, క్రమశిక్షణకు ప్రతి రూపమన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా ప్రజలకు, పార్టీకి ఎంతో సేవ చేశారని కొనియాడారు. గ్రామ కమిటీ అధ్యక్షులు వీరేష్, తెలుగు యువత నాయకులు మహేష్, మారేష్, వీరేష్, జూనియర్ ఎన్‌టిఆర్ సేవా సమితి అధ్యక్షులు వీరేష్ పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- డీఎస్పీ శివ నారాయణస్వామి - ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఆదోని

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం పెంపొందుతుందని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. మంగళవారం ఆదోని మున్సిపల్ క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మభూషణ్ పురస్కార గ్రహీత, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, డీఎస్పీ శివ నారాయణ స్వామి, వైసిపి యువ నాయకులు జయ మనోజ్ రెడ్డి ఆవిష్కరించారు. ఎపి పిఇటి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ శివ నారాయణస్వామి మాట్లాడారు. రాయలసీమ జిల్లాలోని ఒక క్రీడాకారునికి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ గొప్ప క్రీడాకారుడుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని గౌరవించి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. దేశంలో క్రీడలకు, క్రీడాకారులకు గౌరవం ఉందన్నారు. క్రీడల్లో రాణించిన సీనియర్ సిటిజన్లను సన్మానించారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, పారిశ్రామికవేత్త విట్టా రమేష్, ఎంఇఒలు శివ రాములు, శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, ఆనంద్, రామన్న, జోన్ అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో విజేత టాలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విఆర్‌ఒ మర్లబండి రంగస్వామి హాజరై మాట్లాడారు. తెలుగు భాష విశిష్టతను, ఔన్నత్యాన్ని వివరించారు.అనంతరం విద్యార్థులు అమ్మభాష గురించి ఆట పాటలతో, పొడుపు కథలతో, జానపద నృత్యాలతో అలంరించారు. ఉపాధ్యాయులు పురుషోత్తం, పరమేష్, రంగస్వామి,



ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అధిక ధరలపై పోరాటంలో
ప్రజలు భాగ్యస్వామ్యం కావాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

అధిక ధరలు తగ్గించాలని కర్నూలు జిల్లాలో జరిగే పోరాటాల్లో ప్రజలు భాగ్యస్వామ్యం కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.అంజిబాబు కోరారు. మంగళవారం స్థానిక ప్రయివేట్ అతిథిగృహంలో సిపిఎం మండల కార్యదర్శి జయరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వాలు వేస్తున్న పన్నులే దీనికి కారణమన్నారు. విద్యుత్ చట్టం-2020 తీసుకొచ్చి విద్యుత్ రంగాన్ని ప్రయివేట్ వరం చేసి ప్రజలపై భారాలు వేయడానికి పూనుకున్నారని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించే వరకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని కోరారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతోందని, సమస్య పరిష్కారం కోసం ఉద్యమించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరగనున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగ్యస్వామ్యం కావాలని కోరారు. ఆంధ్రయ్య, భీందాస్ పాల్గొన్నారు.

ఉమ్మి సలీంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆదోని


ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టిడిపి మైనార్టీ నాయకులు ఉమ్మి సలీంపై కేసు నమోదు చేసినట్లు ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ఉమ్మి సలీం నిర్వహించిన ధర్నాకు పోలీసుల అనుమతి లేదన్నారు. పోలీసులు అనుమతి నిరాకరణ చేసినా నిబంధనలకు విరుద్ధంగా ఆందోళన నిర్వహించారని తెలిపారు. బహిరంగంగానే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. టూ టౌన్ పోలీసు స్టేషన్ ఎఎస్‌ఐ నరసయ్య ఫిర్యాదు మేరకు ఉమ్మి సలీం, ఖుద్దూస్, గౌస్‌బీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించరాదని చెప్పారు.

సంస్కృతికి వారధి మాతృ భాష

- సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సంస్కృతి, సాంప్రదాయాలకు వారధి మాతృ భాష అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దతుంబళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను ప్రధానోపాధ్యాయులు వెంకటేశులు, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ సక్కిం భాస్కర్, ఆవుల బసప్ప, రామలక్ష్మి, రామ సుబ్బయ్య కొనియాడారు. **ఆదోని**లోని జిఎస్ఆర్, నేషనల్ స్కూళ్లలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను విద్యాసంస్థలు అధినేత గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు గోవిందు, రవి పాల్గొన్నారు. **ఆదోని** ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల పూర్వ తెలుగు విభాగాధిపతి వై.నారాయణరెడ్డి హాజరై తెలుగు భాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ మురళీమోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు అయ్యప్ప, బాలస్వామి, ఎర్రిస్వామి, తెలుగు విభాగం నుంచి వెంకటేశ్వర్లు, నరసింహులు, సంతోషి పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. బాలబంధు, గణిత ఉపాధ్యాయులు గద్వాల సోమన్న, తెలుగు భాష ఉపాధ్యాయులు కేశవయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయులంతా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. బనవాసి నవోదయ విద్యాలయ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ కె.చందిరన్ సీనియర్ ఉపాధ్యాయులు ఎకె.బసవరాజ్, తెలుగు అధ్యాపకులు శశికిరణ్, నరేష్, జగన్నాథ్, కె.శిరీష, ఎం.వెంకటేష్, హరీష్ కుమార్, రింకుశర్మ, ఎం.శ్రీనివాసరావు, ఎ.శివాజీ రావు, అరవింద్ భట్, సత్యనారాయణ, సోనమ్ కుమారి, యోగేష్ చాంద్, రవీందర్, సునీత పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ హైస్కూల్‌లో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా మాట్లాడారు. పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్ పాల్గొన్నారు. **ఆలూరు** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ బి.రాఘవేంద్ర ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ మాట్లాడారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాధవి, అధ్యాపకులు చిరంజీవి, సుశీల, రాఘవేంద్ర, ముద్దప్ప, సిబ్బంది శేఖర్, ప్రణయ్, విద్యార్థులు పాల్గొన్నారు. **చిప్పగిరి** కళాశాలలో తెలుగు భాష దినోత్సం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డివి.సుబ్రమణ్యం, తెలుగు అధ్యాపకులు సరళ దేవి మాట్లాడారు. **గోనెగండ్ల**తో పాటు మండలంలోని పెద్దమరివీడు ఎంపియుపి పాఠశాలలో మాతృ భాష దినోత్సవం నిర్వహించారు. గోనెగండ్లలోని జీనియస్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు వివిధ వేషధారణలతో మాతృ భాష ప్రాముఖ్యతను వివరిస్తూ ఫ్లకార్డులు చేతబట్టి పాఠశాల నుంచి గంజిహళ్లి రోడ్డు వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ ముల్లా జైబా, ఎఇ శ్రీనివాసులు పాల్గొన్నారు. పెద్దమరివీడులో ఎంపియుపి పాఠశాలలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు రామలింగం, తెలుగు ఉపాధ్యాయులు పెద్ద ఖాజా, సీనియర్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు పాల్గొన్నారు. **దేవనకొండ**లోని బివిఆర్ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. పిల్లలకు క్రీడలతో (హాకీ), రంగు రంగులతో రాసిన తెలుగు అక్షరాల ఆటలను ఆడించారు. ప్రధానోపాధ్యాయులు సుభాన్, ఉపాధ్యాయులు హరీష్, వినయ్, మనోహర్, సఫరా, మౌనిక, అనసూయ, రాజేశ్వరి, నందిని, జరీనా పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని శ్రీవైష్ణవి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జాతీయ తెలుగు భాష, క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఎస్‌ఐ వేణు గోపాల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల వ్యవస్థాపకులు ఎస్‌ఐ కబడ్డీ పోటీల్లో పాల్గొని కబడ్డీ ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గురజాల గంగాధర్ రెడ్డి, పాఠశాల ఎఒ ఎస్.రాఘవేంద్ర, సతీష్ చంద్ర, ప్రిన్సిపల్ అశ్విని, పాఠశాల బృందం సి.రవి, షేక్ యూనస్, ఉపాధ్యాయులు ఆదిబసవన్న గౌడ్, మల్లికార్జున, రాజేష్, ఈరన్న పాల్గొన్నారు.



ఆదోనిలో పూలమాల వేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

ప్రజాశక్తి
బుధవారం 30 ఆగస్టు 2023
5
నంద్యాల





సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, పాల్గొన్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు 'గిడుగు'

- జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి - ఘనంగా గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి వేడుకలు





తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న షేక్షావలి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని, తెలుగు భాష అభ్యున్నతికి ఆయన ఎనలేని సేవ చేశారని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రాంథిక భాషను పండితుల నుండి పామర జనాలకు చేరవేసే దిశగా నిరంతరం కృషి చేసిన తెలుగు భాషోద్యమ స్ఫూర్తి దాత గిడుగు వెంకట రామ్మూర్తి అన్నారు. మనం ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులను, మాతృభాషను మరువరాదని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ జెవి సంతోష్, ఏఓ నిజాముద్దీన్, ఆర్ఐలు సుధాకర్, శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే నంద్యాల ఆర్టీసీ డిపోలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా గొప్పదనాన్ని హయ్యర్‌గ్రేడ్ అచారి వివరించారు. డిఎం ఎ.గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ సి.మద్దిలేటి నాయుడు పాల్గొన్నారు. **నంద్యాల :** నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీ నందు గల శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. జూనియర్స్ విభాగంలో లేఖరాయడం, సీనియర్స్ భాగంలో కవితా రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రామాయణం, భాగవతం, పంచతంత్రం, విద్యార్థి కల్యాణం పుస్తకాలను డైరెక్టర్ షేక్షావలి రెడ్డి అందజేశారు. **పాణ్యం :** విజయనికేతన్ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పర భాష లు ఎన్ని వున్నా మాతృభాషకు ఏవీ సాటి రావని అన్నారు. పాఠశాల అకడమిక్ ఇంచార్జి మురారి వేణుగోపాల్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగును వ్యవహారిక భాషగా మార్చేందుకు ఎంతగానో (మిగతా 6వ పేజీలో..)

ప్రతి పేద కుటుంబానికీ లబ్ధి

- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లబ్ధి చేకూరుస్తున్నారని డిప్యూటీ సిఎం, జిల్లా ఇన్చార్జి మంత్రి అంజాద్ భాషా పేర్కొన్నారు. మంగళవారం ఆళ్లగడ్డలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్, మునిసిపల్ నాడు- నేడు, వ్యవసాయం, రీ సర్వే, వైద్య ఆరోగ్యం, ఇరిగేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో అభివృద్ధి చెందాలనే ప్రధాన ఆశయంతో రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతున్నారన్నారు. పేదవారికి ఇవ్వగలిగే ఆస్తి ఏదైనా ఉంటే అది కేవలం విద్య మాత్రమే అని ఎప్పుడు అంటుంటారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ గోసెయిల బేగం, జలవనరుల శాఖ చైర్మన్ గిరిజ హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, విజయ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస రావు, డిఆర్ఓ పుల్లయ్య, కమిషనర్ రమేష్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండలాధ్యక్షులు, జడ్పిటిసిలు, ఎంపిడివోలు, తహశీల్దారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, ఆళ్లగడ్డ నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యర్థుల దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డోన్ : పాతకక్షలతో ప్రత్యర్థుల దాడిలో డోన్‌లో మంగళవారం లక్ష్మన్న(50) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. గతంలో బావిపల్లె శ్రీను హత్యకోసం కొచ్చెరువు జనార్ధన్ నాయుడుతో లక్ష్మన్న రూ.8 లక్షలు తీసుకున్నాడు. శ్రీనును హత్య చేసిన కేసులో నిందితుడుగా ఉన్న లక్ష్మన్న కేసు వాయిదా విషయంలో కర్నూలుకు తన సొంత ఆటోలో వచ్చాడు. కోర్టు పని ముగించుకుని అనంతపురం జిల్లా సికెపల్లికి వెళ్తున్నాడు. మధ్యలో ఆటో రిపేరు రావడంతో డోన్‌లో మార్కెట్ దగ్గర ఆటోను రిపేరు చేయిస్తుండగా అప్పటికే కాపుకాచిన శ్రీను అనుచరులు దాడి చేశారు. వేటకొడవల్లతో ముఖం, మెడపైనరికారు. దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మన్నను ఆస్పత్రికి తరలిస్తుండగా చని పోయాడు. డోన్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు సత్య ప్రకాష్

పాత పింఛన్ విధానం తప్ప మరో పింఛన్ విధానమే వద్దని, పాత పెన్షన్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు సత్య ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఎన్.ప్రతాప్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు వారం రోజులలో సిపిఎస్‌ను రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చి నేడు మాట తప్పి ఏకపక్షంగా అమలు చేయడానికి సిద్ధపడుతున్నారని విమర్శిం చారు. పాత పింఛన్ పునరుద్ధరించాలని, జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదన్నారు. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని, అన్ని రకాల సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఏపీజిఎల్ఐ లోన్లు , మెడికల్ బిల్లులు చెల్లించాలన్నారు. 8వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యా బోధన ఉండాలన్నారు. 117 జీవోను రద్దుచేసి, మున్సిపల్ ఉద్యోగుల, గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించా లన్నారు. మోడల్ స్కూల్‌లో ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సిఆర్పిలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు అన్ని రకాల యాప్‌ల నుండి విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు బి.సుధాకర్, ఉపాధ్యక్షులు సి.కృష్ణయ్య, జిల్లా ఆడిట్ నెంబరు యు. దస్తగిరి, జిల్లా కౌన్సిలర్లు సతీష్, మల్లికార్జున, ఆర్థిక కార్యదర్శి విజయ్ కుమార్, మనోహర్, గోపాల్, ఏసి సన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

పాలకుల విధానాల వల్లే ధరల పెరుగుదల

- నేటి నుంచి 5 వరకు ఆందోళనలు : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణం అని సిపిఎం సీనియర్ నాయకులు ఏ. రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు అన్నారు. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4 సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే సమరభేరి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో గత రెండు నెలల కాలంలో బియ్యం కేజీకి రూ.12 వరకు పెరిగిందని, కూరగాయలు మొదలు నిత్యవసరాలు వరకు అన్ని రేట్లు మండిపోతున్నాయని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తీవ్ర స్థాయికి చేరుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు విపరీతంగా పెరిగినా కేంద్ర ప్రభుత్వం జిఎస్టితో మరింత భారం వేయటం దారుణం అన్నారు. దేశ వ్యాప్త ఆందోళనలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాబాష, ఏ. సురేంద్ర, ఎన్. స్వాములు, పి. సుధాకర్,డి. రామ్ నాయక్, వీరన్న, టి.శివకుమార్, శివుడు తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల నాయకులు ఓబులేసు, లింగస్వామి, తదితరులు గోడపత్రికలను విడుదల చేశారు. **నందికొట్కూరు టౌన్ :** ఈనెల 30వ తేదీ నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ చేపట్టిన సిపిఎం సమరభేరిని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పి పకీరు సాహెబ్, టి గోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో సమరభేరి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సిఐటియు నాయకులు సి నాగన్న, భాస్కర్, ప్రజలు శ్రీనివాసులు, జీవన, బొజ్జన్న, లాల్, మహమ్మద్ రఫీ, రషీద్ తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** ప్రస్తుత పాలనలో ఆకాశాన్నంటుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలేనని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మున్నిపాటి చిన్న మారెన్న, శాఖ కార్యదర్శి మల్లికార్జున అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సమరభేరి పోస్టర్ ఆవిష్కరించారు.



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు రాజశేఖర్ తదితరులు

సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్షులు దర్శనం, నాగరాజు, సిపిఎం శాఖ కార్యదర్శి నాగ వెంకటేశ్వర్లు, జి.మల్లికార్జున సభ్యులు ఏ. రాము, రంగస్వామి, ప్రభాకరు,భీమలింగడు, పెద్ద గంగులు, చిన్న వెంకటనా రాయణ, చిన్న గంగులు తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల:** సమర భేరి పోస్టర్లను బేతంచెర్ల పట్టణంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, ప్రజాసంఘాల నాయకులు జి.సేబగారు, సిఐటియు పట్టణ కార్యదర్శి బి సంజీవ నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు మధు శేఖ తదితరులు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడారు. బి రామాంజనేయులు, జై శ్రీనివాసులు, రాజబాబు వెంకటరమణ, నాగరాజు, నాగేంద్రమ్మ, గుల్ జార్ బీ, రామచంద్రుడు, మధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగలో నిలిచిన నీటి ప్రవాహం

- మరో తడి అందితేనే చేతికి పంటలు - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - రుద్రవరం

తెలుగు గంగ ప్రధాన కాలువలో మంగళవారం నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల క్రితం వెలుగోడు రిజర్వాయర్ నుంచి 2000 క్యూసెక్కుల నీరును గంగా అధికారులు వారాబందీ పద్ధతిలో విడుదల చేశారు. దీంతో రైతులు మొక్కజొన్న, మినుము, పత్తి, మిర్చి, వరి పంటలకు కాలువల ద్వారా నీరును పారించుకున్నారు. అయితే అధికారులు నీటిని నిలుపుదల చేయడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు అరకొరగా సాగునీరు అందింది. అలాగే ప్రధాన కాలువ ద్వారా చెరువులకు నీరు పూర్తిగా అందకపోవడంతో చెరువు కింద పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలుగంగ ప్రధాన కాలువ కింద పంటలు సాగు చేసిన రైతులకు నీరు నిలిచిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కాలువల్లో ఆయిల్ ఇంజన్లు వేసి పంటలకు నీరు పెట్టుకుంటున్నారు. సాగు చేసిన పంటలకు మరో మారు నీరు పెడితే పంటలు పూర్తిగా పండే అవకాశం ఉందని, తెలుగుగంగ అధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరోమారు సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని రుద్రవరం మండల రైతులు కోరుతున్నారు.



నిలిచిపోయిన నీటి ప్రవాహం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వైసిపి పాలనలో ఇసుక అక్రమ తవ్వకాలు

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి బనగానపల్లె : వైసీపీ పాలనలో యధేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు సహజ వనరులైన ఇసుక అక్రమంగా తవ్వి 5 వేల నుండి 6 వేల రూపాయలకు అమ్ముతూ పేద ప్రజలను పీడిస్తున్నరాని మండిపడ్డారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో 1500 నుండి 2000 రూపాయలకు ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచితే, నేడు వైసీపీ ప్రభుత్వం యధేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి ఆదాయమే పరమావధిగా ధరలు పెంచిందని విమర్శించారు. అనంతరం నియోజకవర్గం పరిశీలకులు బాజీ చౌదరి, టీడీపీ నాయకులతో కలిసి తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచి బురానుద్దీన్, పాతపాడు మిట్టపల్లి సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, తులసి రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, పట్టణ అధ్యక్షులు ఖాశీంబాబు, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు టిప్‌టాప్ కలాం అల్తాఫ్ హుస్సేన్, ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, లాయర్ నాగేంద్ర రెడ్డి, ఖాదర్ బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

1న సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్రస్థాయి సదస్సు

- జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల : సాగునీటి ప్రాజెక్టులపై నంద్యాలలో సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 17 నుండి ప్రజా కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం ప్రారంభమైన బస్సుజాతా సెప్టెంబర్ 1న నంద్యాలకు రానున్న సందర్భంగా సిపిఐ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తసెప్టెంబర్ 1న మున్సిపల్ టౌన్ హాల్లో జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎండి ఫరూక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి. ఓబులేసు, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఓ వైపు విద్యుత్ కోతలు.. మరోవైపు వృధా..

- పల్లెల్లో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

గ్రామాల్లో ప్రస్తుతం విద్యుత్ కోతలు ఎడా పెడా విధిస్తున్నారు. అయితే అదే గ్రామాల్లో వీధి దీపాలు మాత్రం పట్ట పగలూ కూడా వెలుగుతున్నాయి. నంద్యాల మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పగలంతా వీధి దీపాలు వెలుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి శాఖకు ఒక సిబ్బందిని నియమించారు. విద్యుత్ శాఖకు కూడా గ్రామంలో ఒకరిని లైన్‌మెన్‌గా ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ అంతరాయాలు కలుగకుండా, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యుత్ వృధా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత లైన్‌మెన్‌దే. కానీ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతూ వందలాది యూనిట్ల విద్యుత్తు వృధా అవుతుంది. గ్రామ పంచాయతీలు విద్యుత్ సంస్థలకు కోట్లాది రూపాయలు బకాయిలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వృధా అవుతున్న విద్యుత్ భారాన్ని వివిధ రూపాలలో ప్రజలపై భారం మోపి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. నంద్యాల మండలంలోని పులిమద్ది, కొత్తపల్లి, కానాల, పోలూరు, రాయమల్పురం, అయ్యలూరు, మిట్నాల, పుసులూరు గ్రామాలలో పగలు రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. దీనివలన వందలాది యూనిట్ల విద్యుత్తు వృధా అయి గ్రామపంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రత్యేక లైన్లు ఆన్ ఆఫ్ స్విచ్లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుంది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్తును అందించడానికి వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రిపూట ఆన్ చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో గ్రామపంచాయతీలకు వేలాది రూపాయలు బిల్లులు వస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసి ఆన్, ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసి విద్యుత్ వృధా కాకుండా పొదుపు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



గ్రామ సచివాలయం దగ్గరే పగలే వెలుగుతున్న వీధి దీపం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

అభివృద్ధి పథంలో పిన్నాపురం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని పిన్నాపురం గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పిన్నాపురం గ్రామంలో నూతన చావిడి నిర్మాణం, మారెమ్మ గుడి పుననిర్మానం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడతూ గ్రామ సమీపాన సోలార్ విద్యుత్ కేంద్రం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అందరికీ జీవనోపాధి కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, కిట్టు, సత్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

కాల్‌మనీ కేసులు నమోదు చేయండి

- తప్పుడు సాక్ష్యాలు చెప్పించే వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పికి కెవిపిఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నిరుపేదలు తీసుకున్న అప్పులు తీర్చినా బాండ్ పేపర్లు ఇవ్వకుండా అధిక వడ్డీలు చూపిస్తూ ప్రజల రక్తం పీలుస్తున్న వారిపై నమోదైన కాల్ మనీ కేసులో తప్పుడు సాక్ష్యాలు చెప్పించిన వారిపై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉప కార్యదర్శి కె.రంగమ్మ, జిల్లా నాయకులు రాజకుమార్‌లు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో వారు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్‌లో నివసిస్తున్న ఎస్.ఎం.వలితో పాటు మరికొంత మంది ఎలాంటి ప్రభుత్వ లైసెన్స్ లేకుండా అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ వసూలు చేస్తున్నారని తెలిపారు. బాధిత మహిళలు 2015 డిసెంబర్‌లో జిల్లా ఎస్పీని ఆశ్రయించి కేసు పెట్టగా కేసు నమోదు అయ్యిందన్నారు. అయితే ఎస్ఎం వలి 15వ సాక్షిగా వున్నారని, సాక్షుల విచారణ సందర్భంగా అతనికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తప్పుడు వ్యక్తితో కోర్టు కానిస్టేబుల్ సాక్ష్యం చెప్పించారని ఫిర్యాదు చేశారు. తక్షణమే వీరిని అరెస్టు చేయకపోతే కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలిసివచ్చే అన్ని సంఘాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో విజయమ్మ, వలి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు వెళ్లొద్దని నోటీసులు దారుణం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : సిపిఎస్ రద్దు చేయాలని సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగేత ధర్నాకు వెళ్ళవద్దని పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణమని యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.సుంకన్న, ఎస్టియు నాయకులు కె.వెంకటరమణయ్య పేర్కొన్నారు. మంగళవారం నాయకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ధర్నాకు వెళ్ళవద్దని పోలీసులు నోటీసులు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నాయకులను, కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్బంధం చేస్తూ ఉద్యమాలను ఆపాలని చూస్తే పోరాటాలు మరింత ఎగిసి పడతాయని తెలిపారు. సిపిఎస్ రద్దు అయ్యేంతవరకు ఉద్యమాలు ఆపే ప్రసక్తి లేదని పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిరోధక చట్టాలపై సదస్సు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలోని కస్తూర్బా స్కూల్ విద్యార్థినులకు బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. తఈ కార్యక్రమానికి తహశీల్దార్ ధోని ఆల్ ఫ్రెడ్, ఎస్ఐ రమేష్ రెడ్డి, డాక్టర్ రాజకుమార్, ఐసిడిఎస్ అసిస్టెంట్ సిడిపిఒ రోజా రాణి, సూపర్వైజర్ పద్మావతిలు హాజరై మాఈట్లాడారు. బాల్య వివాహాల నిరోధక చట్టం పరిధిలో ఉన్న విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎస్ఓ మహబూబ్ జాను, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాదీ రిటైర్డ్ ఉద్యోగి సోమన్న మృతి

- నివాళి అర్పించిన బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని కొండపేటకు చెందిన ఖాదీ సంస్థ రిటైర్డ్ ఉద్యోగి సోమన్న(92) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి సోమన్న భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలిపారు.

పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలి

- జెడ్‌పి సిఇఒ, డిపిఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా, పారదర్శకంగా అందేలా చూడాలని జెడ్పి సిఇఒ నాసర రెడ్డి, నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి మంజులా వాణిలు అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల ఆరు రోజుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాన్ని కర్నూలులోని ప్రేమగిరిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి, రెండవ బ్యాచ్ 100 మంది పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎపి పంచాయతీరాజ్ చట్టం-1994, స్థానిక ప్రభుత్వాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటు, స్థానిక స్వపరిపాలన, గ్రామ సభ- సమావేశాల ప్రాముఖ్యత, కార్యాచరణ కమిటీల ఏర్పాటు, ఆవశ్యకత, ప్రాముఖ్యత, విధులు, బాధ్యతలు, ఆర్థిక పరిపుష్టి, పనితీరు, జవాబుదారితనం, పారదర్శకత, లేఔట్లు, సంక్షేమ పథకాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, ఉపాధి హామీ పథకం, జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ వెంకట రత్నం, కర్నూల్ డిసి డిపిఆర్సి, డోన్ డిఎల్‌పిఒ, డిపిఆర్‌సి సిబ్బంది, ఎంఒటిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ పున:ప్రతిష్ట వేడుకలు

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని లింగంబోడు మెట్ట వద్ద పొలిమేర పెద్దమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ట వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. గతంలో ఉన్న పెద్దమ్మ తల్లి విగ్రహం, గద్దె శిధిలావస్థకు చేరుకోవడంతో గ్రామ సంఘం ఆధ్వర్యంలో నూతన గద్దెను నిర్మింపజేసి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలను తనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. నూతనంగా నిర్మించిన గద్దె చుట్టూ ఇనుపకంచెను వైసిపి ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి తన సొంత ఖర్చులతో నిర్మింపచేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

గిరిజన కుటుంబాలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - శ్రీశైలం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచు గిరిజన కుటుంబాల్ని ఆదుకోవాలని కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు వై. ఆశీర్వాదం కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ శ్రీశైలం పరిధిలోని మాణిక్య మ్మ సెల చెంచుగూడెం పిల్లల చదువుకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆధార్ అనుసంధానం తీసుకున్న నిర్ణయాల వల్ల చదువుకు దూరంగా ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బలహీన వర్గాల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి గిరిజన స్థితిగతుల్ని పరిశోధన చేసి ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి, అంతరించిపోతున్న ఆదివాసి చెంచు గిరిజన జాతిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జెండాలమ్మ, వెంక టేశం, తదితరులు పాల్గొన్నారు.

పోయిన బంగారు నగలు అప్పగింత

- రైతు సంఘం నాయకుని కుటుంబ సభ్యులకు ప్రసంశలు


ఫోటో బంగారు నగలు అప్పగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కొత్తపల్లి

బంగారు నగలు పోగొట్టుకొని బాధపడుతున్న కుటుంబానికి రైతు సంఘం నాయకులు రాముడు కుమారుడు సోమేశ్వరుడు అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే.. కొత్తపల్లి మండలంలోని ముసలమడుగు గ్రామానికి చెందిన కొండగుల మైరున్ బి గత సోమవారం కంటి ఆపరేషన్ చేపించుకునేందుకు నంద్యాల పట్టణానికి బయలుదేరింది. అయితే తన ఇంట్లో తన కుమార్తె బంగారు నగలు నక్లీసు కమ్మలు బుట్టాలు పట్టీలు మూడు తులాలకు పైగా ఉండడంతో ఆ నగలను ఆత్మకూరులో ఉన్న తన కుమార్తెకు షేక్ షహనాభి కి ఇవ్వాలని తీసుకొని పోతున్న తరుణంలో పోగొట్టుకుంది. సోమవారం సాయంత్రం సమయంలో సింగరాజు పల్లి గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకులు రాముడు కుమారుడు సోమేశ్వరుడు తన వ్యవసాయ పొలంకు నీళ్ల పెట్టుకునేందుకు వెళ్తుండడంతో రోడ్డు పక్కన వైరు బుట్ట పడి ఉండడంతో అది తీసుకొని తన తండ్రి రాముడికి ఇవ్వడం జరిగింది. బంగారు నగలు ఆధార్ కార్డులు ఉండడంతో.. ఆధార్ కార్డు అడ్రస్ చూసి ముసలమడుగు గ్రామంలో ఉన్న తన బంధువులకు సమాచారం అందించారు. బంగారు నగలు పోగొట్టుకున్న సమాచారం తెలపడంతో మంగళవారం బాధితులు సింగరాజు పల్లి గ్రామానికి చేరుకొని రైతు సంఘం ఇంటి వద్దకు పోయి బంగారు నగలు తీసుకొని ధన్యవాదాలు తెలిపారు. రాముడి కుటుంబ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

పుష్ప ప్రసాద పేర డోన్ మహిళలకు శిక్షణ ప్రారంభం



ప్రజాశక్తి-డోన్

తాడేపల్లిగూడెం పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీలో మెప్మా సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఈనెల 28 నుంచి 30 వరకు పుష్పప్రసాద పేరుతో పూలతో వస్తువులను తయారు చేయడంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా మెప్మా గ్రూపు సభ్యులతో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు సప్తశైల సుమిత్ర రాజేష్ మాట్లాడారు. డ్వాక్రా మహిళా నైపుణ్యాభివృద్ధి కోసం డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ వారు సబ్బులు, కొవ్వొత్తులు, పూల సువాసనలు, రంగులు... తదితరాలను తయారు చేసేందుకు నైపుణ్యాభివృద్ధి బృందం శిక్షణ ఇస్తోంది.ఇందులో డోన్ డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్ముడుపోని పూలను చెత్తకుండీల్లో పడేస్తున్నారు. బదులుగా అవి మిగిలి ఉన్న పువ్వులకు విలువను జోడిస్తాయి. అలాగే దేవాలయాలకు అంకితమైన పుష్పాలను సేకరిస్తారు. ఈ కార్యక్రమంలో పుష్పప్రసాద పేరుతో ఇప్పటికే టిటిడిలో జరుగుతోంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ టి.జానకి రామన్ , వారి ట్రైనింగ్ స్టాఫ్,లెక్చరర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు 'గిడుగు'

(5వ పేజీ తరువాయి..) కృషి చేశారని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కో ఆర్డినేటర్ బ్రహ్మం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మాఋభాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలతాదేవి, హరినాథ్ గౌడ్, తెలుగు శాఖాధిపతి డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ బడే సాహెబ్, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, ఉమామహేశ్వర్ రెడ్డి, వరలక్ష్మి, కౌశల్యదేవి, రవికుమార్, వహీదా, విద్యార్థులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు వైవిఎస్ నారాయణరెడ్డిని, చెన్నకేశవులును, పిల్లా సుబ్బయ్యను సన్మానించారు. అలాగే క్రీడా దినోత్సవం సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు కంబగిరిని సన్మానించారు. అనంతరం ఎంఇఒలు రాజయ్య, అబ్దుల్ కలాంలను సన్మానించారు. ఇన్చార్జి హెచ్ఎం హుస్సేనయ్య పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో గిడుగు వెంకట రామమూర్తి 160వ జయంతి పురస్కరించుకొని తెలుగు భాష దినోత్సవం వేడుకలు నిర్వహించారు. గిడుగు రామమ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల డైరక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. **మహానంది :** మహానంది మండలం తిమ్మాపురంలోని మోడల్ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎంఇఒ రామసుబ్బయ్య, తెలుగు పాఠ్య రూపకర్త డాక్టర్ నరేష్ బాబు, ప్రిన్సిపల్ లక్ష్మణరావు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** పట్టణంలోని జి. పుల్లారెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి నిర్వహించారు. అకాడమిక్ డైరెక్టర్ శ్రీసాయి ప్రణీత్, హెచ్ఎం చాంద్ బాషా పాల్గొన్నారు. అలాగే వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.


నందికొట్కూరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు


పాణ్యంలో..


ఆళ్లగడ్డ : గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఇష్టారాజ్యంగా ఇసుక దందా : బుడ్డా


ఆందోళన నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

రాష్ట్రంలో వైసిపి నేతలు ఇసుకను ఇష్టారాజ్యంగా దోచుకుంటు న్నారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం వైసిపి ఇసుక దోపిడీకి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు మండలంలోని కరివేన గ్రామ సమీపంలో ఉన్న ఇసుక రీచ్ వద్ద ఆ పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తన అనుచర గణంతో ఇసుక దోపిడీని అధికారికంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, క్లస్టర్ ఇంఛార్జిలు రాజా రెడ్డి, మల్లికార్జున, సీనియర్ నాయకులు నాగుర్, కలిముల్లా, పుల్లా రెడ్డి, గంగాధర్ రెడ్డి, ఫక్రుద్దిన్, సుబ్బా రాజు, శంకరయ్య శర్మ, రమేష్ గౌడ్, అలి హుస్సేన్, చిన్నా, శివా రెడ్డి, శ్రీనివాసులు, షఫీవుల్లా, లింగ స్వామి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



ప్రజాశక్తి - రుద్రవరం

పంటలు బాగా పండాలని, సకాలంలో వర్షాలు కురవాలని కోరుఊత రుద్రవరం సమీపంలోని తెలుగంగ ప్రధాన కాలువ కట్టపై కొలువైన గంగమ్మకు రుద్రవరం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం పూజలు నిర్వహించారు. గంగమ్మకు బోనాలు అర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం రైతులందరూ వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రవరం గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలోని లింగాల గ్రామంలో వర్షం కోసం మంగళవారం నాడు గంగమ్మ పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు బిందెలతో గంగమ్మకు నీళ్ల పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురవాలని రైతుల పంటలు పండాలని పూజలు చేశారు.



పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - మిడుతూరు

పర్యావరణాంన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (అర్విఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలోని కడుమురు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పర్యావరణం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి పర్యావరణవేత, ఐహెచ్ఆర్సి స్టేట్ మహిళా అధ్యక్షురాలు అనీషా పాష, ఐహెచ్ఆర్సి జిల్లా అధ్యక్షురాలు కళ్యాణీ, అర్విఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు బేతంచెర్లకు మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈనెల 31వ తేదీన బేతంచర్లకు వస్తున్నట్లు మండలం ఎంపీపీ బుగ్గల నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సి హెచ్ చలం రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 31న సాయంత్రం నాలుగు గంటలకు బేతంచర్ల పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తున్నట్లు తెలియ జేశారు. నాయకులు పాల్గొనాలని కోరారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని మారుతి నగర్ నందు మంగళవారం నాడు సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కృషితో సిఎం ప్రత్యేక నిధుల ద్వారా, మారుతి నగర్‌లో కౌన్సిలర్ లాలు ప్రసాద్ ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మనపాడు అశోక్, లాలు ప్రసాద్, వైసిపి నాయకులు ఉస్మాన్ బేగ్, మధుసూదన్ రెడ్డి, ముచ్చుమర్రి బాష, బొల్లెద్దుల ఏసన్న, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

వైనాట్ ఒపిఎస్ ఉద్యమానికి మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి -ప్యాపిలి

వైనాట్ ఒపిఎస్ ఉద్యమానికి మద్దతు ఉంటుందని యుటిఎఫ్ నాయకులు ప్యాపిలి మండల శాఖ అధ్యక్షులు బొజ్జన్న, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్ పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిం చాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ విద్రోహ దినోత్సవమైన సెప్టెంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరగబోయే ఉద్యమానికి హాజరవుతు న్నట్లు తెలిపారు. ఉద్యమంలో ఉద్యోగ,ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా కౌన్సిలర్లు సర్వజ్ఞ మూర్తి, అంజనప్ప, చంద్ర మోహన్,కంబగిరి,రమేష్ నాయుడు,రాజ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న దృశ్యం

అహోబిలేసున్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని ఎపి జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి(నాని) మంగళవారం దర్శించుకున్నారు. వీరు ఆలయం వద్దకు చేరుకోగానే అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందించారు. వీరి వెంట కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి ఉన్నారు.

రామతీర్థ క్షేత్రాన్ని దర్శించుకున్న మాజీ ఎంపీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రాన్ని నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాప్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆయన ఆలయానికి రాగానే అలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అనంతరం పుట్టాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఈవో సాయి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం ఆయనను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు.


స్వాగతం పలుకుతున్న దృశ్యం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

పిల్లలపై లైంగిక దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - ఆత్మకూర్

పిల్లలపై లైంగిక దాడులను అరికట్టడంలో అన్ని శాఖల అధికారులు పనిచేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నాడు కోర్టు ఆవరణంలో పోలీస్ విద్యాశాఖ ఐసిడిఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అపరిచిత వ్యక్తులతో పిల్లలు ఎలా ఉండాలి అనే విషయంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆత్మకూరు సిఐ నాగభూషణం ఎస్సై కృష్ణమూర్తి, ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఓ సూర్యకుమారి, సూపర్వైజర్ కోమలి, ఎంఈఓ జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎడిఎ

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : ఎడిఎ

ప్రజాశక్తి - పాములపాడు

ఆర్‌బికె సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు ఎడిఎ ఆంజనేయ హెచ్చరించారు. మంగళవారం పాముల పాడు మండలంలో ఆర్‌బికె సిబ్బందికి క్షేత్ర సాయి సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ పంట నమోదు, పీఎం కిసాన్ ల్యాండ్ లింకేజీ, పొలంబడి, జాతీయ ఆహార భద్రత మిషన్, గ్రామీణ విత్తనాల పథకం, యంత్ర సేవా, తదితర పథకాల మీద సమీక్షిం చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి, ఏఎస్ఓ నిర్మల, ఏఈఓ మద్దిలేటి, ఎంపిఇఒలు, తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌పై అవగాహన

ప్రజాశక్తి-నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని ప్రాజెక్టు సిడిపిఓ కార్యాలయం ఆవరణలో నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, జూపాడుబంగ్లా సెక్టార్లకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలకు జల్ జీవన్ మిషన్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. జల్ జీవన్ మిషన్ కర్నూలు జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం సభ్యులు, డిసిఐఎస్ఎ వి. భీమశంకర్ రెడ్డి పాల్గొని ఫీల్డ్ టూల్ కిట్ ను ఉపయోగించుకునే విధానము నీటిని శుద్ధి చేయు విధానం, మొదలగు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు వెంకటేశ్వరమ్మ, అనురాధ, ఆశీర్వాదమ్మ, నిర్మల, శేషమ్మ, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ సేవలను కేంద్రం గుర్తించింది : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

దివంగత ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ సేవలను కేంద్రం గుర్తించి రూ.100 నాణెంపై ఎన్టీఆర్ చిత్రాన్ని ముద్రించడం హర్షణీయం అని టిడిపి మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్ బాష, రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి ఫరూక్ అన్నారు. చాగలమర్రి పట్టణ ంలోని కార్యాలయంలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి టిడిపి విజయం సాధించడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్, నాయకులు మౌలాలి, జిలేబి షరీఫ్, అబ్దుల్లా, అక్బర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి మైనార్టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్ బాష

పల్లె వెలుగు ప్రయాణీకులకు బహుమతులు : మేనేజర్

ప్రజాశక్తి-డోన్

డోన్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు బహుమతులను అందిస్తామని డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుండి డోన్ ఆర్‌టిసి డిపో ఆధ్వర్యంలో డోన్ కర్నూలు రూటులో తిరుగు పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్ ప్రవేశ పెడుతున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించి,వారి గమ్య స్థానాల్లో దిగినప్పుడు వారి టికెట్ల వెనక పేరు,ఫోన్ నెంబర్ రాసి,బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్సు నందు వేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా తీసి, డిప్‌లో గెలుపొందిన వారికి మొదటి,రెండవ బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకోవాలనికోరారు.

పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్యాపిలి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతులు పంట అమలు చేసుకోవాలని ఉద్యాన అధికారి కళ్యాణి తెలిపారు. మంగళవారం ఊటకొండ, గోపాల్ నగరం గ్రామంలో అరటి పంటలో పంట నమోదు కార్యక్రమాన్ని ఉద్యాన అధికారి పరిశీలించి, రైతులందరూ పంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం అరటి, దానిమ్మ, చీని తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.


అరటి పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి కళ్యాణి

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- శాంతి రాంలో అంతర్ రాష్ట్ర క్రీడా పోటీలు


ప్రజాశక్తి - పాణ్యం

భారతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం శాంతిరాం పార్మసీ కళాశాలలో అంతర్ రాష్ట్ర క్రీడా పోటీలను నిర్వహించారు. ముందుగా పోటీల్లో పాల్గొంటున్న జట్లు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్‌ను ముఖ్య అతిథి ఆర్‌జిఎం విద్యాసంస్థల డీన్ డా డివివి అశోక్ కుమార్, శాంతిరాం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మధుసూదన్ శెట్టి తిలకించి, గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఎపి, తెలంగాణ నుంచి 12 ఫార్మసీ కళాశాల జట్లు వాలీబాల్, చెస్, క్యారమ్స్, షటిల్ తదితర పోటీల్లో తలపడనున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ముని శేఖర్, 12 కళాశాలల ఫిజికల్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు. **నంద్యాల :** జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్, ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖ నాయకులు శ్రీనాథ్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పివి సుధాకర్ రెడ్డి, సోమేశుల నాగరాజు, కోచ్‌లు పాల్గొన్నారు. అలాగే నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాష దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి, అనస్థీషియా డాక్టర్ రవికృష్ణన్ హాజరయ్యారు. క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాల బృందం నిర్వహించిన పోటీల్లో విజేతలకుఉ బహుమతులు అందజేశారు. **బనగానపల్లె :** విద్యార్థులకు మాతృభాష, క్రీడలు ఎంతో ముఖ్యమని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ఎం అధ్యక్షతన మాతృభాష, క్రీడల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అగస్త్య ఫౌండేషన్ ఇన్స్ట్రక్టర్ వెంకటరాముడు ఆధ్వర్యంలో టాటా పవర్ డోనార్ వెంకటరమణల ప్రోత్సాహంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాణ్యం : జ్యోతిని వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ మధు సూదన్ శెట్టి

నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని శ్లోక పాఠశాల యందు గిడుగు రామ్మూర్తి జయంతిని, ధ్యాన్ చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరై వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ కవిత తెలుగు పద్యాలు పాడి అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జె. శ్రీనివాస్ రెడ్డి , చైర్మన్ శ్రీధర్ రెడ్డి , డైరెక్టర్స్ కవిత, శ్రీదేవి రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత ఆధ్వర్యంలో తెలుగు భాష తియ్యదనం-తెలుగు పాట కమ్మదనం అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎలమర్తి రమణయ్య, రాష్ట్ర సాహిత్య అవార్డు గ్రహీత, ప్రముఖ తెలుగు కవి, గాయకులు, డాక్టర్ తోగట సురేష్ బాబు తెలుగు భాష గొప్పదనాన్ని తెలిపారు. అలాగే బసి రెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం, ధ్యాన్ చంద్ జయంతిని నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వివిఎస్ సత్యనారాయణ, డైరెక్టర్స్ సరళ దేవి, ప్రిన్సిపల్ జాన్ ఎలిషా బాబు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. **డోన్ :** పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పద్మావతమ్మ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు రాధ,లీలావతమ్మ, ఆదినారా యణ, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను మాట్లాడారు. **పగిడ్యాల :** పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం హెచ్ఎం మధుసూదన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, ఎంఈఓలు సుభాన్, మురళీ మోహన్ రెడ్డిలు హాజరై ధ్యాన్‌చంద్, గిడుగు చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వివిధ రకాల క్రీడలను ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.


నందికొట్కూరు టౌన్ : విద్యార్థులతో శాప్ చైర్మన్


డోన్ : గిడుగు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


పగిడ్యాల: విద్యార్థులతో సర్పంచ్, జడ్పిటిసి ఉపాధ్యాయులు